సాక్షి జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



కేయూలో ప్రపంచస్థాయి పరిశోధన

కేయూలో ప్రపంచ స్థాయి పరిశోధన జరుగుతోందని వీసీ తాటికొండ రమేశ్ తెలిపారు.
- 8లో▸



వేతన వెతలు

కాకతీయ యూనివర్సిటీలోని దినసరి వేతన, క్యాజువల్ ఉద్యోగులకు కేయూ అధికారులు వేతనాలను పెంచడం లేదు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$26^0/23^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూసేకరణపై సింగరేణి డైరెక్టర్ల సమీక్ష



భూపాలపల్లి అర్బన్: ఏరియాలో ఓపెన్‌కాస్ట్‌లకు సంబంధించిన భూసేకరణపై సింగరేణి డైరెక్టర్లు శనివారం కలెక్టర్ భవేష్‌మిశ్రాను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సమీక్షించారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓపెన్ కాస్ట్ 2, 3 ప్రాజెక్టులలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను కొనసాగించడానికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు. మిగులు భూసేకరణను అతిత్వరలోనే పూర్తిచేసేందుకు సంబంధిత అధికారులను ఆదేశిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్(ఫైనాన్స్) బలరాం, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జీఎం శ్రీనివాసరావు, ఎస్టేట్ జీఎం సురేష్, అధికారులు తుకారాం, రాజగోపాల్, కుమారస్వామి పాల్గొన్నారు.

ముగిసిన మద్యం షాపుల టెండర్లు

- రేపు లక్కీ డ్రా

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని 60 మద్యం షాపులకు 2,068 అప్లికేషన్లు వచ్చాయి. సోమవారం లక్కీ డ్రా పద్ధతి ద్వారా అధికారులు షాపులను కేటాయించనున్నారు. డ్రా కార్యక్రమాన్ని భూపాలపల్లి పట్టణంలో సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించేందుకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. 2019-21 మద్యం షాపుల టెండర్లలో 1,575 దరఖాస్తులు వచ్చాయి. 2021-23 సంవత్సరంలో 1,905 దరఖాస్తులు రాగా.. ఈ సారి 2,068 దరఖాస్తులు వచ్చాయి. భూపాలపల్లి సర్కిల్ పరిధిలో 19 షాపులకు 782, కాటారం సర్కిల్‌లో 12 షాపులకు 341, ములుగు సర్కిల్‌లో 20 షాపులకు 658, ఏటూరునాగారం సర్కిల్ పరిధిలో 9 షాపులకు 287 దరఖాస్తులు వచ్చాయి. ములుగు జిల్లా మల్లంపల్లి మద్యం షాపునకు అత్యధికంగా 104 దరఖాస్తులు వచ్చాయి. గోవిందరావుపేట మండలం చల్వాయి షాపునకు 5, తాడ్వాయి మండలంలోని మేడారం షాపు-1కి 6దరఖాస్తులు, షాపు-2కు 8 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మద్యం దుకాణాలకు టెండర్ల ద్వారా ప్రభుత్వానికి రూ.41.36 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రశాంతంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని పర్యాటక శాఖ అర్హులైన పర్యాటక సంబంధ రంగాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21 రకాల విభాగాల నుంచి ఈ దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 31వ తేదీలోపు పర్యాటక శాఖ కార్యాలయం హైదరాబాద్‌లో లేదా పోస్ట్ ద్వారా అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 94408 16068 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

వీడని ముసురు..

వర్షపాతం వివరాలు (మి.మీ)	
మహాదేవపూర్	85.2
పలిమెల	83.4
మహాముత్తారం	94.2
కాటారం	102.8
మల్హర్	44.6
చిట్యాల	32.2
టేకుమట్ల	17.8
మొగుళ్లపల్లి	26.6
రేగొండ	48.0
గణపురం	81.2
భూపాలపల్లి	33.4

భూపాలపల్లి రూరల్: జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. 20రోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్న వరి, పత్తి రైతులకు వర్షాలు ఊరటనిచ్చాయి. జిల్లాలోని మహాముత్తారం, కాటారం మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. కాటారం మండలంలో అధ్యధికంగా 102.6 మిల్లీమీటర్ల వర్షం కురువగా, టేకుమట్ల మండలంలో అతి తక్కువ 17.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదనైట్లు అధికారుల తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు


ములుగు: జిల్లాలోని జాతీయ రహదారి, ఆర్ అండ్ బీ, పంచాయతీ రోడ్లపై రాత్రిపూట ప్రమాదాల నివారణకు అత్యాధునిక బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ గాష్ ఆలం తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బారికేడ్లను ఆయా మండలాల పోలీస్ అధికారులకు శనివారం అందించారు. జిల్లాలోని రహదారులు ఎక్కువగా అడవులతో నిండి ఉన్న కారణంగా రాత్రి సమయాల్లో మూలమలుపులు, జంక్షన్ పాయింట్స్ ప్రాంతాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

చెవులు మాట్లాడతాయి. కళ్లు సమాధానం చెబుతాయి. ఈ రెండింటి సైగలు భావాల్ని వ్యక్తపరుస్తాయి. వీటికో ప్రత్యేక లిపి కూడా ఉంది. ఓ ఉపాధ్యాయుడు తనకొచ్చిన ఆలోచనకు రూపమిచ్చాడు. దీంతో కొంత మంది విద్యార్థులు ఇంద్రియాలతో మాట్లాడుతున్నారు. గవర్నర్ సైతం వీరి ప్రతిభను చూసి ఔరా! అన్నారు. కళ్లు, చెవులు పలికే భాష వెనుక కథ 'సాక్షి' ప్రత్యేకం.

కళ్లు.. చెవులు.. ఓ లిపి!

ఇంద్రియాలతో మాట్లాడుతున్న విద్యార్థులు

- ప్రత్యేక లిపి రూపొందించిన ఉపాధ్యాయుడు మధు
- గవర్నర్ తమిళిసై ప్రశంసలు
- ఆకట్టుకుంటున్న కొత్త లిపి



ఏంటీ లిపి..

'ఐ'కోడింగ్ అంటే కను సైగలతో మాట్లాడడం. ఏ, బీ, సీ, డీ ఒక్కో అక్షరానికి ఒక్కో కోడ్ ఉంటుంది. వీటిని కనుసైగలతో వ్యక్తీకరిస్తారు. చెవుల కదలికలతో సైతం భావాల్ని వ్యక్తపరుస్తున్నారు. దీనికీ ప్రత్యేకంగా ఓ లిపిని తయారు చేశారు.

కాళేశ్వరం:

ఏటా నిర్వహించే సైన్స్‌ఫేర్‌లో ఎవరూ చేయని అద్భుతాన్ని ఆవిష్కరించాలనుకున్నాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఫిజికల్‌సైన్స్ స్కూల్ అసిస్టెంట్ మద్క మధు. అతడి దృఢ సంకల్పానికి విద్యార్థుల ఆసక్తి తోడైంది. దీంతో నోటితో మాట్లాడకుండా, చెవితో వినకుండా కళ్ల సైగలతో, చెవుల కదలికలతో మాట్లాడే ఓ లిపిని విద్యార్థులు, ఉపాధ్యాయుడు కలిసి తయారు చేశారు. విద్యార్థుల ప్రతిభను చూసి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వాహ్ శభాష్ అంటూ అభినందించారు. విద్యార్థుల్ని, టీచర్‌ను ప్రత్యేకంగా సన్మానించారు.

సండే స్పెషల్



గవర్నర్ తమిళిసై వద్ద లిపిని ప్రదర్శిస్తున్న విద్యార్థులు(ఫైల్)

క్రియేటివిటీ అదిరింది..

మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆకుతోట మల్లిక, సల్పాల దేవిక, ఆరెందుల రాజశేఖర్, మద్దిరాల శివ నవదీప్, సల్పాల నందిని, సల్పాల సంకీర్తన 'ఐ' కోడింగ్, 'ఇయర్' కోడింగ్‌లో ఉపాధ్యాయుడు మధు వద్ద శిక్షణ పొంది ప్రతిభ కనబరుస్తున్నారు. వీటితోపాటు గారడి, ఐబ్రోస్ (కనుబొమ్మలు)సైగలతో భావ వ్యక్తీకరణ జరుపుతున్నారు. లిప్(పెదవు)ల మూవ్‌మెంట్‌ను బట్టి మాట్లాడింది చెప్పేస్తున్నారు. విద్యార్థులు వీటిపై మరింత శిక్షణ పొందుతున్నారు. ఇప్పటికే పాఠశాలలో 10 మందికి పైగా ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయుడు మధు శిక్షణ ఇస్తున్నారు.

దేశ రక్షణకు ఉపయోగం..

ఐ, ఇయర్ కోడింగ్ భాష దేశ రక్షణకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం సీబీఐ, ఆర్మీ, ఇంటెలిజెన్స్, రా ఇతర నిఘావర్గాలకు ఈ లిపి ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయుడు మధు, విద్యార్థులు చెబుతున్నారు. ఒక పేపర్‌లో ఉన్నది చదివి విద్యార్థి నోటిని తెరవకుండా కళ్లు మూస్తూ.. తెరుస్తూ... మీదకు, కిందికి ఎగరేస్తూ.. చెవులను కదిలిస్తూ సైగలతో భావాల్ని వ్యక్తీకరిస్తే.. మరో విద్యార్థి ఆ సైగలు చూసి పొల్లుపోకుండా పేపర్‌పై రాసి చూపిస్తుంది. విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకుని చేతిలో ఏముందో చెబుతూ మంత్రాలు, తంత్రాలు లేవని గ్రామీణులకు అవగాహన కూడా కల్పిస్తున్నారు.



కళ్లు కదిలిస్తుండగా లిపిని రాస్తున్న విద్యార్థిని



మరిచిపోలేని అచీవ్‌మెంట్



ఐ కోడింగ్ గురించి మా గైడ్ టీచర్ మధు చెప్పారు. ఆసక్తితో నేర్చుకున్నాను. ఈ భాషను భవిష్యత్‌లో దేశానికి ఉపయోగపడేలా సాధన చేస్తాం. గవర్నర్ మేడమ్ మమ్మల్ని మెచ్చుకోవడం మరిచిపోలేని అచీవ్‌మెంట్.

– ఆకుతోట మల్లిక, పదో తరగతి

గవర్నర్ కితాబిచ్చారు..



'చెవులను కదిలించడం జంతువులకే సాధ్యం అలాంటిది మీరు చేస్తున్నారంటే గ్రేట్' అని గవర్నర్ మేడమ్ కితాబిచ్చారు. మా టీచర్ల ప్రోత్సాహంతో బాగా శిక్షణ పొందుతున్నాం. మేం, మా భాష దేశ రక్షణకు ఉపయోగపడితే చాలు. పోలీస్ జాబ్ చేయాలనేది నా కోరిక.

– శివ నవదీప్, ఎనిమిదో తరగతి

ప్రపంచంలో ఎక్కడా లేని భాష



సైన్స్‌ఫేర్‌లో కొత్తగా ఉండాలని ఐ, ఇయర్ కోడింగ్ రెండు ప్రత్యేక భాషలు ఎంచుకున్నా. దీనికి ప్రత్యేకంగా లిపిని తయారు చేశా. దీనికి మాప్రాంతంలో మంచి ఆదరణ వస్తోంది. నాకు తెలిసి ప్రపంచంలో ఎక్కడా ఈ భాష లేదని అనుకుంటున్నా. గవర్నర్‌ను విద్యార్థులతో కలవడం మరిచిపోలేం. విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి దేశానికి ఉపయోగపడేలా చేయాలనేది నా లక్ష్యం. ఇంకా గారడి, ఐబ్రోస్, లిప్ మూవ్‌మెంట్‌పై సాధన జరుగుతోంది.

– మద్క మధు, ఫిజికల్‌సైన్స్ ఎస్‌ఏ, మహదేవపూర్

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ భవేష్‌మిశ్రా



5కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సూచించారు. ఓటరు నమోదు కోసం శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి జయశంకర్ విగ్రహం వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 19వరకు 18 సంవత్సరాలు నిండి ఉండే వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రాబోయే డిసెంబర్ లేదా జనవరి నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ నెల 26, 27వ తేదీల్లో గ్రామాలు, ఏరియాలోని పోలింగ్ బూత్‌లో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్ నెల మొదటి శనివారం, ఆదివారాలు కూడా బీఎల్‌ఓ ఓటరు నమోదు చేపడుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రమాదేవి, జిల్లా అధికారులు, సింగరేణి అధికారులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన శశాంక్ గోయల్



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని శనివారం సాయంత్రం మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, ముఖ్య అర్చకులు వెంకటనాగరాజుశర్మలు శశాంక్‌గోయల్‌ను ఘనంగా స్వాగతించారు. శశాంక్ గోయల్ ముందుగా ఆదిశంకరులు, వల్లభ గణపతిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అర్చకులు శేషవస్త్రాలు, మహదాశ్వీచనం అందజేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మండల కేంద్రంలోని వాగు



మళ్లీ పొంగిన వాగులు

మహాముత్తారం మండలంలోని వాగులు శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు మళ్లీ పొంగిపొర్లాయి. మండలకేంద్రంలోని బొర్రవాగుతోపాటు కేశవాపూర్ వద్ద గల పెద్దవాగు శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో మండల కేంద్రానికి వెళ్లడానికి రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం వరకు వాగుల ఉధృతి తక్కువ కావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడింది. – మహాముత్తారం

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి



ఆలయంలో స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు



స్వామివారిని దర్శించుకుని హారతి తీసుకుంటున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం శనివారం వందలాది మంది భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం ప్రారంభం కావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు తదితర సుదూర ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. భక్తులు కార్లు, ప్రైవేట్ బస్సులు, డీసీఎంలు, ఆటోలు జీపులలో ఉదయాన్నే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నాన మాచరించి గుట్టపై స్వయంభుగా వెలిసిన హేమాచలున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు స్వయంభు స్వామివారికి ఆలయ అర్చకులు తిలతైలాభిషేకం పూజా కార్యక్రమాన్ని నిర్వహించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని అర్చకులు వివరించిన స్వయంభు స్వామివారి చరిత్ర, ప్రత్యేకతలు, ఆలయ పురాణాన్ని విని పులకించారు. స్వామివారి నాభి చందనాన్ని ప్రసాదంగా స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలోని అన్నదానం కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం వరకు సేదతీరి వారి వారి గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లారు.

ప్రయోగాలేవి..?

- విద్యార్థులకు అందని ప్రయోగాత్మక విద్య
- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని ప్రయోగశాల, పరికరాలు
- నిధుల కొరతతో పాత పరికరాలతోనే కాలం వెళ్లదీత
- నాలుగేళ్లుగా నిలిచిన నిధుల మంజూరు
- సాంకేతిక విద్యకు దూరంగా విద్యార్థులు

కాటారం: అంతంత మాత్రంగానే నిధుల విడుదల.. ప్రయోగ పరికరాలు పూర్తిగా లేకపోవడం తదితర కారణాలతో విద్యార్థులకు సైన్స్ విద్య అందడం లేదు. మౌలిక బోధనలతోనే ఉపాధ్యాయులు పాఠాలు చెప్పి మమా అనిపిస్తున్నారు. దీంతో విలువైన విజ్ఞాన పరికరాలు నిరుపయోగంగా మారిపోవడమే కాకుండా సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన లేకుండా పోతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాలతో సైన్స్ విద్యను అందించి సత్ఫలితాలు సాధించడానికి ఏర్పాటు చేసిన ప్రయోగాత్మక బోధన ప్రకటనలకే పరిమితమైంది. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు పాఠ్యాంశాలపై మక్కువ పెంచడంతో పాటు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రభుత్వం ప్రయోగాత్మక బోధనకు శ్రీకారం చుట్టింది. పాఠ్య పుస్తకాల్లోని అంశాలను కృత్యాధారంగా, ప్రయోగాత్మకంగా బోధించాలని ఆదేశించింది. 1నుంచి 5వ తరగతి వరకు పాఠ్య పుస్తకాల్లోని అంశాలను సంబంధిత ఉపాధ్యాయులు తయారు చేసి వాటిని పిల్లలతో చెప్పించే వారు. ఇలా చేయడంతో పిల్లలకు ఎంత వరకు పాఠ్యాంశం అర్థమైందని తెలుసుకోవడానికి వీలుంటుంది.

ప్రయోగాలు కీలకం..

ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో ఎక్కువ భాగం ప్రయోగాలతో కూడిన పాఠ్యాంశాలు ఇచ్చారు. వాటిని ప్రయోగం చేసి చూపితే గాని అర్థం కాని పరిస్థితి ఉంటుంది. దీంతో ప్రయోగాత్మక బోధనపై సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందు కోసం ప్రయోగ పరికరాలు, రసాయనాల కొనుగోలుకు గతంలో విద్యాశాఖ ఉన్నతాధికారులకు విన్నవించగా అనుమతించారు. అప్పట్లో అరకొర నిధుల మంజూరుతో పూర్తిస్థాయిలో పరికరాల కొనుగోలు సాధ్యపడలేదు. నిధులకు అనుగుణంగా కొనుగోలు చేసిన కొద్దిపాటి పరికరాలతో ప్రయోగాలు సంపూర్ణంగా చేసే అవకాశం లేకపోవడంతో పలు పాఠశాలల్లో అవి సైతం మూలనపడ్డాయి.



మల్హర్ మండలం రుద్రారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిరుపయోగంగా సైన్స్‌ల్యాబ్

నాలుగేళ్లుగా మంజూరు కాని నిధులు...

2019 సంవత్సరంలో రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్(ఆర్ఎంఎస్ఏ) ద్వారా ప్రతి ఉన్నత పాఠశాలకు రూ.50 వేల చొప్పున, అలాగే ప్రాథమికోన్నత పాఠశాలకు సర్వశిక్షా అభియాన్ ద్వారా రూ.22వేల నిధులను విడుదల చేశారు. వీటి ద్వారా పలు ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగేళ్ల క్రితం కొన్ని ప్రయోగ పరికరాలు కొనుగోలు చేశారు. ఆర్ఎంఎస్ఏ పథకం అమలు నిలిచిపోవడంతో నిధులు మంజూరు కావడం లేదు. దీంతో పాఠశాలల్లో ప్రయోగాత్మక బోధన నిర్వహణ కష్టతరంగా మారింది. అందుబాటులో ఉన్న కొన్ని పరికరాలతో పాటు కాలంచెల్లిన రసాయనాలతో ఉపాధ్యాయులు ప్రయోగాలను నామమాత్రంగా వివరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

పోటీలకు దూరంగా..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రయోగాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో సైన్స్‌కు సంబంధించిన పోటీలకు విద్యార్థులు దూరంగా ఉంటున్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వం నిర్వహించే సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ అవార్డుల కార్యక్రమాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. పాఠశాలల్లో ప్రాక్టీస్ చేసే అవకాశం లేకపోవడంతో కనీసం జిల్లాస్థాయిలో సైతం ప్రతిభ కనబర్చే సత్తా విద్యార్థుల్లో లేకుండా పోతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రయోగాత్మక బోధనకు అవసరమైన పరికరాలు సమకూర్చడంతో పాటు బోధన జరిగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లాలోని పాఠశాలల వివరాలు..	
ప్రాథమిక పాఠశాలలు	317
ప్రాథమికోన్నత పాఠశాలలు	44
ఉన్నత పాఠశాలలు	69
విద్యార్థుల సంఖ్య	29,164

బోధన జరిగేలా చర్యలు



సైన్స్ ప్రయోగాలు ప్రత్యక్షంగా చేసి విద్యార్థులకు పాఠాలు బోధిస్తే కానీ పాఠ్యాంశాలు అర్థం అయ్యే పరిస్థితి లేదు. నిధుల కొరత కారణంగా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సైన్స్ పరికరాలు అందుబాటులో లేవు. దాతల సాకారం, స్కూల్ గ్రాంట్స్‌ని సర్దుబాటు చేసి సైన్స్ ప్రయోగ పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూస్తాం. అందుబాటులో ఉన్న సైన్స్ పరికరాలతో ప్రయోగాత్మక బోధన జరిగేలా చర్యలు తీసుకుంటాం. పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత దిశగా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

– రాంకుమార్, డీఈఓ

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఎస్ తాడ్వాయి: ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ, మండల స్పెషల్ ఆఫీసర్ అల్లెం అప్పయ్య సూచించారు. వర్షాలు పడుతుండడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను శనివారం అప్రమత్తం చేశారు. దీంతో డీఎంహెచ్ఓ అప్పయ్య, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, తహసీల్దార్ రవీందర్ మేడారంలో పర్యటించారు. జంపన్నవాగు ఉధృతిని పరిశీలించడంతో పాటు ముంపు గ్రామాలైన ఊరట్టం, తూములవాగు వరద ప్రభావం ఏ మేరకు ఉందని పరిశీలించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మేడారం జంపన్నవాగు ముంపు ప్రాంతాల గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. మేడారం జంపన్నవాగు ఉధృతి ఏ సమయంలోనైనా పెరిగే ప్రమాదం ఉందన్నారు. వీరి వెంట ఆర్ఐ సునీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ రమేష్, రిజిస్ట్రార్, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో ఈఏడాది జూన్‌లో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం సాయంత్రం కేయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేష్ విడుదల చేశారు. మొత్తం 45,219మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 22,014 మంది (48.68 శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య మల్లారెడ్డి తెలిపారు. మహిళలు 23,519మందికిగాను 14,174మంది(60.27శాతం), పురుషులు 21,700కి 7,840మంది 36.13శాతమే ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస రావు, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ జ్యోతి, ఆచార్య మహమ్మద్ ముస్తఫా, డాక్టర్ తిరుమల దేవి, డాక్టర్ నరేందర్, సహాయ రిజిస్ట్రార్ లింగంపల్లి రాము పాల్గొన్నారు. కాగా విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వేతన వెతలు



కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు(ఫైల్)

- కేయూ దినసరి వేతన, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగుల్లో ఆవేదన
- అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు
- సమ్మెకు వెళ్లాలని ఐదు సంఘాల నిర్ణయం

కేయూ క్యాంపస్: కేయూలోని దినసరి వేతన, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు యూనివర్సిటీ అధికారులు ఆరేళ్లుగా వేతనాల్ని పెంచట్లేదు. పలుసార్లు వర్సిటీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా, ఆందోళనలు చేపట్టినా అధికారులు జాప్యం చేస్తూనే ఉన్నారని విమర్శలున్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారంతా కోరుతున్నారు. రెగ్యులర్, కాంట్రాక్టు, టైంస్కేల్ ఉద్యోగులకు వేతనాలు పెరిగాయి. అలాగే తమకూ 30 శాతం వేతనాల్ని పెంచాలని కొన్నేళ్లుగా వారంతా కోరుతున్నారు. యూనివర్సిటీలో ఎన్‌జీఓ కేడర్ దినసరి వేతన ఉద్యోగులకు నెలకు రూ.20 వేలపైన వేతనం ఉంది. క్లాస్‌ఫోర్త్ దినసరి వేతన ఉద్యోగులకు నెలకు రూ.12 వేలపైన మాత్రమే ఉంది. ఆ రెండు కేడర్లలో కలిపి 166 మంది పని చేస్తున్నారు. లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులు 341 మంది వరకు ఉండగా.. వీరికి ఒక్కొక్కరికి రూ.6వేల నుంచి 10 వేలకు పైగా వేతనాలు పొందుతున్నారు. దినసరివేతన, లంప్సమ్, క్యాజువల ఉద్యోగులు కలిపి మొత్తంగా 507 మంది పనిచేస్తున్నారు. వీరంతా ఆరేళ్లుగా వేతనాల పెంపునకు ఎదురు చూస్తున్నారు.

అమలు చేయట్లేదు!

దినసరి వేతన ఉద్యోగుల సంఘాల బాధ్యులు వీసీ రమేశ్‌ను కలిసి పలుమార్లు విన్నవించారు. కాగా.. కొంతకాలం క్రితం దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస్‌రావుతో కమిటీ వేసి ఎంత వేతనాలు పెంచాలని కూడా రిపోర్టు ఇచ్చారు. దానిని వీసీ అమలు చేయలేదు. పలుమార్లు ఆందోళనలు కూడా చేశారు. పాలక మండలి సభ్యులను, ప్రజాప్రతినిధులను కలిసినా అమలుకు నోచుకోవట్లేదు. ప్రభుత్వ చీఫ్‌విప్ సమక్షంలో వీసీ వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి మరిచిపోయారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కేయూ పాలక మండలి సమావేశంలో వేతనాల పెంపు అప్రూవ్ అయ్యింది. కానీ నేటికీ అమలు మాత్రం కావడం లేదు. 25 ఏళ్ల నుంచి పనిచేస్తున్నవారుకూడా ఇందులో ఉన్నారు. ఎప్పటికైనా రెగ్యులరైజ్ అవుతుందని వారంతా ఎదురు చూస్తున్నారు.

సమ్మె నోటీస్ ఇవ్వాలని నిర్ణయం

కేయూలోని దినసరి వేతన, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగుల ఐదు సంఘాల బాధ్యులు ఈనెల 16న సమావేశమయ్యారు. రెండు మూడ్రోజుల్లో తమకు 30 శాతం వేతనాలు పెంచకపోతే సమ్మె నోటీస్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈమేరకు సమ్మె నోటీస్ ఇచ్చేందుకు వారంతా సిద్ధం అయ్యారు.

సమ్మె చేస్తాం



కేయూలోని దినసరివేతన, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు ఆరేళ్లుగా వేతనాలు పెరగలేదు. దీంతో వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు మూడ్రోజులు చూసి వేతనం పెంచకపోతే సమ్మె నోటీస్ ఇవ్వాలని ఐదు సంఘాలు నిర్ణయించాయి. అనంతరం సమ్మెకు వెళ్తాం.

– శివప్రసాద్, కేయూ డైలీవైజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు

వీసీ నోట పెంపు మాట

రెండేళ్లుగా ప్రతీ స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున వీసీ రమేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం వీరి సమస్యను ప్రస్తావిస్తూ.. త్వరలోనే వేతనాలు పెంచుతున్నట్లుగా ప్రకటిస్తారు. ఆతర్వాత పట్టించుకోరనే ఆరోపణలున్నాయి. ఈనెల 15న కూడా వీరి సమస్యను వీసీ ప్రస్తావించారు.

కేయూలో ప్రపంచస్థాయి పరిశోధన



పాల్గొన్న బోధన, బోధనేతర ఉద్యోగులు తదితరులు



మాట్లాడుతున్న వీసీ రమేష్

- వైస్ చాన్స్‌లర్ టీ.రమేష్
- కేయూలో న్యాక్ సక్సెస్ మీట్

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రపంచ స్థాయి పరిశోధన జరుగుతోందని వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. శనివారం కేయూ 48వ ఆవిర్భావ దినోత్సవం, న్యాక్ ఏ ప్లస్ సక్సెస్ మీట్ కార్యక్రమాలను విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ రమేష్ మాట్లాడారు. దక్షిణ భారత దేశంలో గొప్ప విశ్వవిద్యాలయంగా కేయూ వెలుగొందుతోందన్నారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడింగ్ సమష్టి విజయం అని పేర్కొన్నారు. న్యాక్ పూర్వపు సంచాలకులు ఆచార్య వీ.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. కాకతీయ విశ్వవిద్యాలయం గొప్పచరిత్ర కలిగి ఉందన్నారు. విశ్వవిద్యాలయాలకు నిధులు, నియామకాల అవసరం ఉందన్నారు. రానున్న రోజులల్లో గ్రేడింగ్ ఉండదని ఎవరికివారు బలాలు, బలహీనతలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత విద్యారంగంలో చాలా మార్పులు వచ్చాయన్నారు. ఇతర విశ్వవిద్యాలయాలకు కేయూ రోల్ మోడల్ కావాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా వచ్చిన శాతవాహన విశ్వవిద్యాలయ విశ్రాంత వైస్ చాన్స్‌లర్ ఆచార్య మహమ్మద్ ఇక్బాల్ అలీ మాట్లాడుతూ.. సమన్వయముతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఆచార్య నరసింహాచారి న్యాక్ కోసం మొదటి నుంచి చేసిన పనులను వివరించారు. అనంతరం విశ్రాంత ఆచార్యులు కిష్టయ్య, సదానందం, ఇంద్రసేనా రెడ్డి, చిలక సంజీవ, విజయలక్ష్మి, రాంరెడ్డి, కృష్ణమాచారి, కేయూ ఎన్జీఓ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, నాగేశ్వర్ రావు, శ్రీధర్ కుమార్ లోద్ మాట్లాడారు. ఈసందర్భంగా ఆచార్య వీ ఎస్ ప్రసాద్, వీసీ ఆచార్య తాటికొండ రమేష్‌ను సన్మానించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లా పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

పల్స్ ఆక్టివ్ స్టేషన్ ప్రారంభం

- కాజీపేట జంక్షన్‌లో రూ.50 ఫీజుతో ఆరోగ్య వివరాలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో రైల్వే అధికారులు కాంట్రాక్ట్ పద్ధతిన అతి తక్కువ ఫీజుతో ఏర్పాటు చేసిన పల్స్ ఆక్టివ్ సెంటర్ ప్రజలు, ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగకరంగా మారనుంది. రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంలో రైల్వే అధికారులు పల్స్ ఆక్టివ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రూ.50 ఫీజు చెల్లించి పల్స్ ఆక్టివ్ సెంటర్ స్టాండ్‌పై సీసీ కెమెరా కింద నిలబడితే బీపీ, ఎత్తు, బరువు, ఫ్యాట్‌తోపాటు బాడి మాస్ ఇండెక్స్, బీఎంఆర్, ప్రోటీన్ మాస్, స్కెలెటల్ మజిల్ మాస్, పల్స్ స్కోర్, బాడీ మినరల్ మాస్, బాడీ మినరల్ కంటెంట్, బోన్ మినరల్ కంటెంట్, టోటల్ బాడీ వాటర్ వైద్య పరీక్షలు రికార్డు చేసిన తర్వాత పల్స్ రిపోర్టు వస్తుంది.



స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పల్స్ ఆక్టివ్ మీటర్

15వ రోజుకు చేరిన హౌస్‌సర్జన్ల సమ్మె

- మంత్రి హరీష్‌రావు ఫేస్‌మాస్క్‌తో నిరసన



కాశిబుగ్గలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆయుర్వేద హౌస్‌సర్జన్లు

వరంగల్ : ఆయుష్ పరిధిలోని ఆయుర్వేద, యునాని, సిద్ధ, హోమియో వైద్య కళాశాలల్లోని హౌస్‌సర్జన్లకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ హౌస్‌సర్జన్లు చేపట్టిన సమ్మె శనివారం 15వ రోజుకు చేరుకుంది. నేటి సమ్మెలో హౌస్‌సర్జన్లు మంత్రి హరీష్‌రావు ఫేస్‌మాస్క్‌ను ధరించి కళ్లకు నల్లగుడ్డలు ధరించి వినూత్నరీతిలో ఆయుర్వేద ఆస్పత్రి నుంచి కాశిబుగ్గ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హౌజ్‌సర్జన్లు, విద్యార్థులు మాట్లాడుతూ ఆయుష్ పరిధిలోని హౌస్‌సర్జన్లకు అందిస్తున్న స్టయిఫండ్‌ను రెండేళ్లకోసారి 15 శాతం పెంచాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు పెంచలేదన్నారు. మంత్రి హరీష్‌రావు కావాలనే ఆయుష్ డిపార్టుమెంట్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైద్య కళాశాల్లో బోధన, బోధనేతర సిబ్బందిని, ఆస్పత్రుల్లో వైద్యులు, పారామెడికల్, నాల్గో తరగతి సిబ్బంది నియామకాలు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలన్నారు. ర్యాలీలో తెలంగాణ ఆయుస్ హౌస్‌సర్జన్ల సంఘం వరంగల్ నాయకులు డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ రాజేష్, డాక్టర్ కిషోర్, డాక్టర్ నవీన్, డాక్టర్ మహేశ్వరి, డాక్టర్ నివేదిత, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్‌లకు ఘన నివాళి



అమరులకు నివాళులర్పిస్తున్న కవులు, కళాకారులు

హన్మకొండ: ప్రజా గాయకుడు గద్దర్, లౌకిక ప్రజాస్వామికవాది జహీరుద్దీన్ అలీఖాన్‌కు కవులు, కళాకారులు, సామాజిక వేత్తలు మాట, పాట, ఆటలతో ఘనంగా నివాళులర్పించారు. శనివారం రాత్రి హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో కవులు, కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్, లౌకిక ప్రజాస్వామికవాది జహీరుద్దీన్ అలీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ రచయిత అనిశెట్టి రజిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రజాయుద్ధ నౌక, ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ తన జీవితాంతం దళిత, బడుగు, బలహీన ప్రజల కోసం పరితపించాడని కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆకాంక్షలైన దోపిడీ పీడన లేని సమసమాజ సాధనకు కవులు, కళాకారులు కృషి చేయాలని పేర్కొన్నారు. వరంగల్ రచయితల సంఘం అధ్యక్షుడు నల్లెల్ల రాజయ్య, విరసం జిల్లా కన్వీనర్ కోడం కుమారస్వామి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ముందుగా ఇద్దరు అమరులకు మౌనం పాటించి సంతాపం తెలిపారు. బీ.కే ఆధ్వర్యంలో కళాకారులు అశోక్, బుల్లెట్ వెంకన్న, బి.వెంకన్న, కళా వెంకట్ అమరులను స్మరిస్తూ పాటలు పాడారు. ఈ సభలో ఆయా సంఘాల ప్రతినిధులు జిలుకర శ్రీనివాస్, బాసిత్, మెట్టు రవీందర్, సిరాజుద్దీన్, ఎం.చుక్కయ్య, ఎం.శంకర్ నారాయణ, బీ.వెంకన్న, నబీ, సాయిని నరేందర్, సూరి, పులి సత్యనారాయణ, తరాల సందీప్ పాల్గొని ప్రసంగించారు.

హైకోర్టు సీజేకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్ : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధేని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వంగా కలిసి న్యాయవాదుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కోర్టుల్లో విధిస్తున్న కాస్ట్‌లను ఆ కోర్టు బార్ అసోసియేషన్‌లకు రాసే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఫెడరేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈ.ఆనంద్‌మోహన్, సెక్రెటరీ రామచంద్రారెడ్డి, ఇతర ఫెడరేషన్ సభ్యులు ఉన్నారు.

సీడీయూ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఉపకులపతి దామోదర్

నయీంనగర్ : చైతన్య(డీమ్డ్ టుబీ) విశ్వవిద్యాలయం యూజీ సెమిస్టర్ –2, పీజీ –2, 4, బీటెక్, బీఫార్మసీ, ఎంటెక్ సెమిస్టర్ –2 ఎంఫార్మసీ సెమిస్టర్ –4, ఫార్మ డీ పరీక్షా ఫలితాలను ఉపకులపతి ఆచార్య జి.దామోదర్ శనివారం విడుదల చేశారు. యూజీ సెకండ్ సెమిస్టర్ పరీక్షల్లో 406 మంది విద్యార్థుల ఉత్తీర్ణతతో 68.58 శాతం, పీజీ –2, 4 సెమిస్టర్ల పరీక్షల్లో 496 మంది విద్యార్థుల ఉత్తీర్ణతతో 89.37శాతం, బీటెక్, బీఫార్మసీ సెమిస్టర్ –2లో 192 మంది విద్యార్థులు ఉత్తీర్ణతతో 64.86 శాతం, ఎంటెక్ సెమిస్టర్ –2 లో 20 మంది విద్యార్థులు, ఎంఫార్మసీ సెమిస్టర్ –4లో 11 మంది విద్యార్థులు, ఫార్మడీలో 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎం.జగదీశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.రవీందర్, ఆచార్య జి.శంకర్ లింగం, వి.మల్లికార్జున్, ఓఎస్‌డీ డాక్టర్ కె.వీరవెంకటయ్య, ఆచార్య ఎస్.సుమ, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ తనిఖీ

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో శనివారం తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే మెకానిక్ సిబ్బంది తనిఖీ చేసి పంపించారు. న్యూఢిల్లీ–హైదరాబాద్ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎస్–2 కోచ్‌లో పొగలు, మంటలు వచ్చాయని ముంబాయి సెంట్రల్ రైల్వే నాగపూర్ సమీపంలో నిలిపివేయడం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో దాదాపు రెండు గంటల ఆలస్యంతో చేరుకున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్–2 కోచ్‌ని, ట్రెయిన్ ఫార్మేషన్‌ను కాజీపేట జంక్షన్‌లో క్యారియజ్ అండ్ వ్యాగన్ రోలింగ్ ఇన్, రోలింగ్ అవుట్ సిబ్బంది తనిఖీ చేసి పంపించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

అవార్డు అందుకున్న ప్రొఫెసర్ రామేశ్వరం



అవార్డు అందుకుంటున్న రామేశ్వరం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ప్రొఫెసర్, హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డిపేటలో అంతర్జాతీయ ప్రకృతివైద్య సాహిత్య గ్రంథాలయం, రీసెర్చ్‌సెంటర్ వ్యవస్థాపకుడు ఆచార్య గజ్జల రామేశ్వరం శనివారం విజయవాడలో పాతూరి నాగభూషణం పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో న్యూఢిల్లీ సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ డాక్టర్ నాగులపెల్లి భాస్కర్‌రావు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాతూరి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూరి, నెల్లూరి రచయిత్రి చంద్రలత, బాధ్యులు పట్టాభి, శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ కార్మికుడి మృతి



పరిశీలిస్తున్న సీఐ రవిరాజు

ఆత్మకూరు: క్వారీలో బోర్ వెల్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కార్మికుడిపై బండ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు సమీపంలోని శ్రీనివాస క్రషర్‌కు చెందిన క్వారీలో శనివారం బోర్‌వెల్ వేస్తున్నారు. ఈక్రమంలో బోర్‌వెల్ యజమాని సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కార్మికుడు లక్ష్మణ్(45)పై బండపడడంతో తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ రవిరాజు సంఘటన స్థలానికి చేరుకుని సంఘటన తీరును పరిశీలించారు. లక్ష్మణ్ సోదరుడు సుధారామ్ నేతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బోర్‌వెల్ యజమాని రమణపై కేసు నమోదు చేశామని సీఐ రవిరాజు తెలిపారు. లక్ష్మణ్ మృతితో కార్మికులు కన్నీటిపర్యంతమయ్యారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో 18 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శనివారం నిర్వహించిన దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ సెకండియర్ పరీక్షల్లో మూడు పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 18 మంది విద్యార్థులు పట్టుబడి డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. వరంగల్ ఏఎస్ఎం డిగ్రీ కళాశాలలో 12మంది, సీకేఎం కళాశాలలో ఇద్దరు, నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో నలుగురు విద్యార్థులు కాపీయింగ్ చేస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. మొత్తంగా 2,921 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సిండగా శనివారం 2,132 మంది హాజరయ్యారని తెలిపారు.

జలసవ్వడి

ఈ దృశ్యాన్ని చూసి.. పాల నురగ పల్లానికి పరుగెడుతోందనుకుంటే పొరబడినట్టే.. అవును.. మనం చూస్తున్నది పాల నురగ కాదు.. ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చీకుపల్లి అటవీప్రాంతంలోని బొగత జలసవ్వడి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో జలపాతం శనివారం ఉప్పొంగింది. వరద ఉధృతితో జలపాతం వద్దగల స్నానాల కొలను పాల నురగతో నిండిందా.. అన్నట్టుగా కనువిందు చేస్తోంది.

– వాజేడు



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ HNK శాంతి బాలాజీ రెసిడెన్సీలో 2BHK ఫ్లాట్ ఎక్సైజ్ కాలనీ, సుబేదారిలో కిరాయికి యివ్వబడును. సంప్ర॥ 9505446428, 9951506281. [W-189139]

PLOT FOR SALE

■ మడికొండ హైవే రోడ్డు ఖండాల దాబా ఎదురుగా వాకుల్ డిఫెన్స్ G+1 వర్కిషన్ ఈస్ట్ సౌత్ రెండు రోడ్లు 169 గజాల ప్లాట్ సేల్ చేయబడును, గజానికి 24000, కాజీపేట, హనుమకొండ, సెల్ నెంబర్: 9848486768. [W-1002382]

■ హన్మకొండ చౌరస్తా నుండి 2KM దూరంలో 300 గజాల ప్లాటు తూర్పు ఫేస్ కలది. ఒక రూమ్ కట్టి ప్లాటు చుట్టూ 5F గోడ గేట్ పెట్టినది. అమ్మకం గ॥ రూ॥ 23000/- ఫిక్స్‌డ్ నో బ్రోకర్స్. 9395561655. [W-785648]

■ మన వరంగల్‌లోని శంభునిపేట సమీపంలో నాయుడు పెట్రోల్ పంపు, వినాయకనగర్‌లో 170 గజాల Open Plot కలదు. సంప్ర॥ సెల్: 9849063958. [W-189138]

■ వరంగల్ జాన్ పీరీలు రైల్వే గేట్ ప్రక్కన్న 109 గజాల ఉత్తరం ఫేస్ గల Open Plot అమ్మబడును వివరాలకు సంప్ర॥ సెల్: 9849459661. [W-189137]

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్ళ మధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం. లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

HOUSE FOR SALE

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళే 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent House అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27210]

■ మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785647]

■ హన్మకొండ, పోస్టల్‌కాలనీలో 300 చ.గ.ల G+2 బిల్డింగ్ అమ్మకానికి కలదు. వెస్ట్ ఫేసింగ్, 100% వాస్తు గలది. సంప్ర: 9849283034. [W-785645]

FLATS FOR SALE

■ 38 లక్షలకు 2BHK (East Face) గోపాలపురం అరుణోదయ కాలనీలో 934 Sq.feet గల New Flat అమ్మబడును. Cont: 9885301652. [WA-7215]

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్‌కి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27213]

PLOT DEVELOPMENT (OR) SALE

■ యూనివర్సిటీ మేన్‌రోడ్ మాత బార్ & రెస్టారెంట్ దగ్గరలో సుభాష్‌నగర్ లోని 2వ లేన్‌లో 40 వెడల్పు, 80 పొడుగు గల 355 Sq.Yds ప్లాటు డెవలప్‌మెంట్‌కి లేదా అమ్మకానికి కలదు. సంప్ర: 7095167309. [W-189132]

SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189136]

■ మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలలో గాని తాకట్టులో వున్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 100% స్పాట్ క్యాష్ ✆ 8897552200 [T-142]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-189133]

BUSINESS OFFER

■ స్త్రీ/పురుషులు, చిన్న పెట్టుబడితో ప్రతినెల 25000/- ఫిక్స్‌డ్ వేతనంతో పాటు మీకు సరిపడ ఆదాయం పొందండి. ఫోన్ : 7386425653, 7416087357 [H-189383]

LOANS

■ బాలాజీ లోన్స్ : మార్టిగేజ్ లోన్, పర్సనల్ లోన్, బిజినెస్ లోన్, I.T. రిటన్స్ (G.S.T.) చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్. లేడి రిసెప్షనిస్ట్ కావలెను. సంప్ర. 8522825358 [M-1221525]

WANTED

■ Sales Representative: Preferred qualification.1) Solid Education Background (Bachelor's Degree preferred. 2) Fluent in English, Telugu and Hindi, 3) Ability to Travel as required please send your resume to mail. info@primetextiles.in. or Whatsapp: 9849268123, Last Date to apply 23.8.2023. Interview follows for impressive profiles. [WA-980]

■ వరంగల్‌లో వాషింగ్ మిషన్ రిపేర్ చేయడానికి టెక్నీషియన్ కావలెను. (బైక్ తప్పనిసరి+ పెట్రోల్ అలవెన్స్+ మంచి జీతం ఇవ్వబడును) సంప్ర॥ 8179585395. [WA-1110397]

■ GNM Nurses & Experienced Lab Technicians required for Guardian Hospital, Opp: LB College, Mulugu "X" Road, WGL. 12 to 2PM. [WA-963]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000–16000. సంప్ర॥ 9000463426. [W-1002380]

■ WGL, Experienced కార్ టెక్నీషియన్స్, హెల్పర్స్ కావలెను. సాలరీ: 20,000/- మా మోటార్స్ ములుగు X రోడ్ వరంగల్, సెల్: 9948434745, 9000687574. [WA-541]

■ స్టార్ హోంకేర్ సర్వీసు 24 గం॥ల పేషెంట్లు, పెద్దవారిని, చిన్నపిల్లలను ఇంటి వద్దనే చూసుకోవడానికి ఆడ/మగవారు కావలెను. భోజన సదుపాయం కలదు. 24 గం॥ డ్యూటీ. Cont 8977263124, 8897730132. [W-1002379]

ఆజాకా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్ /క్లర్క్ / అటెండర్స్ / ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7531]

■ గ్రాడ్యుయేషన్ చదువుకున్న లైసెన్ ఆఫీసర్స్ మరియు కన్‌స్ట్రక్షన్ వ్యవసాయం లో అనుభవం ఉన్న సీనియర్ సూపర్ వైజర్ కావలెను. PVC ప్రాజెక్ట్స్, Call Mon-Sat 11am-5pm on 040-23338080, 8686417794 [H-781265]

■ Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221522]

WANTED TEACHERS

■ Wanted Applications from Qualified and experienced teachers having excellent communcation skills for all subjects (Pre Primary, Primary and Upper Primary) Salary: 10K to 12K, IIT, Bilology & Telugu (High School) Salary: 10K to 20K. Contact Immediately. Shantiniketan High School, Near Durgeshwara Swamy Temple, Warangal, Cont No: 7995850051. [WA-16683]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.